కథానిక:

వీణ

= శ్రీ తెన్నేటి సూరి =

౧

"రాగసుధారసా"...

......స్వరరాగసుధా..."

ఆ మధురరాగం...ఆవీణ మెట్లమీద...పైస్థాయిల నుంచి క్రిందిస్థాయిలకు, బరువులెత్తుతున్న మాధుర్యాలతో,...ఆగి ఆగి...నెమ్మది నెమ్మదిగా...దిగుతోంది—లేడి చూలాలు కొండవాగుజాలు వెంట దిగే అలససౌందర్యంతో—

రాచవుసిరి చివుళ్లలాంటి ఆ మునివ్రేళ్లు అ వీణమెట్లను చకచకా చక్కిలిగింతలుబెట్టి కిలకిలలాడించివేస్తున్నయ్—

ఆముంజేతుల బంగారుగాజుల మంజుశింజితాలు పసిబిడ్డకులుకు నవ్వుల పలరింపులకు పులకరించుకొన్న బిడ్డతల్లిముద్దుల లలితనినాదాలలాగు ఎడతెగని వరుసగా తాళగతులలోవినిపిస్తున్నై - స్వర్గసుఖానికిసోపానాలై.

కళ్యాణి ఒడిలో ఆవీణ యిటూ అటూ - కొంచెం కొంచెం...ఊగిసలాడుతూ, పసిబిడ్డలా ముద్దులు గుడుస్తోంది.

కళ్యాణి, పంచపాళీలో కూర్చుని, 'రాగసుధారసా" అనే మధురగీతిని వాయించుతోంది.

ఆ మధురస్వనాలు గాలితీగెలతో కలిసి ఆ పంచపాళీ ముందు వున్న పూలమొక్కలలోకి వ్యాపిస్తున్నై. ఆ పూలమొక్కలు—గుత్తులు గుత్తులుగా విచ్చుకొన్న పూలు కొప్పుకొనలలో చెరువుకుని, బారులు తీరి నిశ్శబ్దంగా కూర్చుని వింటున్నయ్. చిరుగాలికో, లేక ఈ గానం విని ఆనందించో, కొంచెం కొంచెంగా తలలు పంకిస్తున్నాయి కాని—చప్పట్లుగొట్టి, ఈలలు వేసి, "భేష్! భేష్!" అంటూ కొంపలంటుకున్నట్టుగా బొబ్బలు పెడుతూ, గందరగోళంగా అభినందించటం లేదు.

గంధర్వస్త్రీలు ఈ మధురగానం వినాలని ప్రియుల తీపి కౌగిలింతలలో నుంచి, అప్పటికప్పుడు, కికురించి తప్పించుకు వచ్చి కూర్చున్నట్టుగా వున్నయ్, ఆ పూలమొక్కలు—లేకపోతే ఇతర సమయాల్లో అంతంతక్కైసేతలు దేనికి?

గగనపథంవెంట పోతున్న చంద్రుడు ఈ గానం చెవులబడి, కాలుకదపలేక నిలబడిపోయినట్టున్నాడు. వెండివెన్నెలలు ఒలికొలికి పోతున్నయ్, ఆతోటంతా—

సర్వసంగపరిత్యాగిగా ఆయన్ను ప్రజలు ఎంత మెచ్చుకుంటున్నా, గౌతమదేవుడు, ఈ గానకళావిరతిలో మునిగి తన్మయుడు కాకుండా వుండలేకపోయాడు. అది వారి శక్తికికూడా మించినపనిగా పరిణమించింది. ఆ పూలమొక్కల మధ్య, ఒక తెల్లరాతి పలక పరిచివున్న వేదికమీద కూర్చుని, శరీరమంతా చెవులు చేసుకుని వింటున్నారు. అరమోడ్చిన ఆ కనురెప్పలపైనా, ప్రపంచశాంతి ప్రదాలైన ఆ పెదవుల మీదా, ఈ గానంవల్ల కలిగిన మహదానందం, జిలిబిలిగా, జిలిబిలిగా, చిందులాడుతోంది. ఈ గానం వింటూ, అలా పదేపదే, అచలంగా వుండిపోవటంవల్ల

కాబోలు, ఆయన దేహం ఒక పాలరాతి ప్రతిమగా మారిపోయింది.

వెండివెన్నెలలు ఒలికిపోతున్నయ్—

గౌతమదేవులు కూర్చునివున్న ఆ స్ఫటికపుపలక ఒక చిన్ని జలాశయంలా కనుపించుతోంది...ఆమధుర గానానికి, ఆ స్ఫటికం, ఒడలు జలదరించుకుని, నిలువునా నీరై పూరుకుంది.

"రాగసుధారసా"

కళ్యాణి హృదయం ఉద్రిక్తమౌతోంది. ఆమె సృష్టించుకుంటున్న ఆ మధురనినదాలు ఆమెనే వివశ పరుస్తున్నయ్ — ప్రసవితమైన పచ్చిబాలింత తన కడుపుపంటను పొత్తిళ్లలో చూచుకుని, గర్వంతో, పరవశత్వాన్ని పొందినట్టు—కళ్యాణి ఉద్రిక్తౌతోంది. ఆ ఉద్వేగంలో, ఆమెహృదయం ఆవీణ మెట్లమీద అనంతంగా మాధురీ సౌందర్యాలను ఒలికొలికి పోతోంది, మునివ్రేళ్ల గమనాలతో స్వర్గసోపానాలుగా మారుతున్నయ్, ఆవీణమెట్లు—

ఆందోళిరాగం, ఆవీణ మెట్లమీద ఒకలతకూనగా ప్రభవించింది...మోసులెత్తి చివురులు దొడిగి, క్షణక్షణం చకచకా, విస్తృతమై, విచ్చులకొని,...ఆలంబనాలతో అవసరం లేకుండానే...తీగెలు తీగెలుగా...అనలనలుగా ... జాగిజాగి ... సాగిసాగి ... తూగితూగి, పరుగులు పెడుతూ...ఆపంచపాళీనీ, ఆ పూలతోటను, ఆ పరిసరాలను, ఈ రోదసినంతా వ్యాపించి పోతోంది — అత్యద్భుత దివ్యసౌందర్యాలను గుబుల్కొని గుత్తులు గుత్తులుగా పుష్పించి పోతూ—ఆ కుసుమగుళుచ్ఛాల సౌరభ్య సౌందర్యాలతో, రోదసి గుబాళించి విస్తుపోతోంది.

ఇలాంటి కుసుమవిసరాలు దేవలోకంలో కూడావున్నా యన్నట్టు మన మెప్పుడూ విన్న మాటగాదు. 'వాడని, పరువం చెడని; రూపసౌరభాలుగల పారిజాతంలాంటి పువ్వులేవో కొన్ని వున్నాయంటూ వచ్చారు గాని, ఇలా వీటికి మల్లే... కర్ణపేశలాలైన మధుర రుతాలనుకూడా కలిగివున్న పువ్వులసంగతి మన మెప్పుడు విన్నాం?—

ఆపంచపాళీలో, కళ్యాణికి కొంచెం చేరువలోనే, ఆమె తండ్రి చంద్రశేఖరరావుగారు, పేము కుర్చీలో కన్నులు మూసుకుని కూర్చుని, యీ విపరీతమైన సౌందర్యలతను దర్శిస్తున్నారు...ఆదివ్య కుసుమాల సౌరభాన్ని చెవులతోనే ఆఘ్రాణించుతున్నారు. ఆకుసుమవిసరాలనుంచి స్రవించి ఆయన శ్రవోగోళాలలో ఒలికిన అమృతబిందువుల జాలులు ఆయన రక్తఝురులలో మర్మరించుతూ హృదయానికి వ్యాపించి బరువు లెత్తిపోతున్నయ్...ఆతీపి బరువులను ఇక తను మోయలే ననుకున్నాడు...

"తల్లీ!"...అని పలకరించాడు...మెల్లిగా.

"ఆఁ!..." స్వర్గంనుంచి లాజవాబు.

"కొంచెంసేపు...ఆపుతావూ?..."

బిక్కమొగంపెట్టి ... "ఇప్పుడు — ఆపలేను నాన్నా..." అన్నది, దీనంగా—

"సరే...వాయించుకో...ఆవెన్నెలలోకిపోయి దూరంగా కూర్చుని వింటాను—"

పంచపాళీమెట్లు దిగుతున్నాడు...నిశ్శబ్దంగా.. ఆయనబట్ట తలమీద వెన్నెల తీగెలుపడి, జిగేల్ జిగేల్ మంటున్నయ్...ఆయన తొడుక్కున్న చలువచేసిన పొందూరు ఖద్దరు లాల్చీ పాముకూసంలా మిలమిల లాడిపోయింది. ఆ వెన్నెల వెలుగులలో—పూలమొక్కల మధ్యగా నడుస్తూ, గౌతమదేవులు అధిష్ఠించివున్న ఆ వేదికమీదికి చేరుకుని ముంజేతిమీద శిరస్సు నానించి కొంచెంగా జాలిగిలబడి పడుకున్నాడు—

ఆ రాగలతను దర్శించకుండా వుండాలని, ఇంత దూరం శ్రమపడివచ్చింది, ఈ రసిక హృదయం—లాభం? తల్లికొంగు కొనపట్టుకుని వెనకాతలే పాదాలు తొక్కుతూ, పరుగులు తీసుకుంటూ వచ్చిన పసిబిడ్డలా...కిలకిల లాడుకుంటూ ... అనలుహస్తాలుగా సాచి...ఆయన్ను చేరుకుంది ఆ రాగలత...ఉక్కి

బిక్కిరిగా, ఆయన్ను, బిగ్గ, కౌగలించుకుని, పకపక లాడింది.

ఆ ఆలింగన సుఖావాప్తితో ఆయన నిమీలిత నేత్రుడై...మ్రాన్పడిన చిత్తరువులా—

౨

ఠాంగ్-ఠాంగ్-ఠాంగ్-ఠాంగ్-ఠాంగ్...

దూరాన వున్న, పొగబారిన చింత చెట్టుక్రింద నుంచి వినుపించుతున్నయ్ - దెబ్బమీదదెబ్బ- విసుగెత్తేలా; విరతిలేని విశ్వకార్మికుని సమ్మెటపెట్లు అనంతకాల గర్భంలోకి ప్రతిధ్వనించుతున్నయ్...

"జడ-జడ-జడ-జడ-జడ..."

ఎడతెగని లోహపుగొలుసులుగా...ధ్వనించుతోంది...కృష్ణరావు హృదయంలోకి-ఆటైప్ మెషిన్-మానవునికి జడత్వాన్ని నిరంతం ఉద్బోధిస్తోంది - ఉక్కుశబ్దాలతో-ఆటైప్ మెషిన్-

జానెడు ముందుకు జరగటం—మళ్లా జానెడు వెనక్కు లాగి వేయబడటం - స్వేచ్ఛావిహీనతచేత ఎదుగూబొదుగూ లేకుండాపోయిన మానవసంస్కృతి యొక్క దౌర్భాగ్యస్థితి ప్రతిపాదించుతోంది- ఆటైప్ మెషిన్ క్యారియర్-

తనకు బానిసగా వుండాలని యీ పిశాచ యంత్రాన్ని సృష్టించాడు, మానవుడు. అది తిరగబడి మానవుణ్ణే బానిసను చేసి పారేసి, తన ముందు కూలేసుకుని ఎముకలు కొరుక్కుతింటోంది అహోరాత్రులూ_ రక్కసిలా. దానిముందు కూర్చుని పనిచేస్తున్నాడు కృష్ణరావు. అతనికీ ఆతని మానవత్వానికీ మధ్య పర్వతాలల్లే అడ్డంనుంచున్నయ్-ఆ గదిగోడలు.

ఈ బ్యాంకీ ఉద్యోగంలో అతను చేరి ఒక మాసంరోజులు మాత్రమే అయింది. కాని యీముప్పై రోజుల బానిసత్వం అతనికి ముప్పై యుగాల నరకమనిపించింది. జీవితంలో అతనికి అదివరకు అనుభవానికిరాని, భయంకరమైన సత్యాలు అనేకం రుద్రమూర్తులులా ప్రత్యక్షమై, అతణ్ణి కల్లోల పరుస్తున్నయ్. సహజంగా ధీశాలిగావటంచేత వాటిని జయించాలని, శాయశక్తులా తిప్పలుబడుతున్నాడు. ఆవ్యర్థప్రయత్నం అతనికి ముచ్చెమటలు పట్టిస్తోంది.

తన జీవితంలోకి సుఖ సౌందర్యాలను తెచ్చుకోవాలని అతని ఆశ. తన రక్తమాంసాలను మానవత్వాన్నీ హరించి ఒరులు సుఖసౌఖ్యాలను అనుభవించటానికే యీ నిర్మాణమంతా పన్నబడి వుందని అతనికి తెలియకపోవటమే అతని అజ్ఞానం—

అతను బీ.కామ్. ప్యాసైనాడు—షార్టుహ్యాండూ టైపురైటింగూ కూడా తరువాత పూర్తిజేశాడు. గుమాస్తా గిరీ ఖాళీలేకపోవటంచేత టైపిస్టు ఉద్యోగం ఇచ్చారు. మొదట్లో చిన్న ఉద్యోగమే అయినా తను పెద్ద పరీక్ష ప్యాసైవున్నాడు గనుక క్రమేణా పైకి పోవచ్చుననుకున్నాడు—ధర్మాన్ని మోచేత్తో వెనక్కునెట్టి అధర్మం ముందుకు తోసుకుపోతున్న ఈరోజుల్లో ఇది పిచ్చిఊహేననాలి. అసలు తనకు ఈపెద్ద డిగ్రీ ఉండటంచేతనే పెద్ద పెద్దప్రమాదాలు బండలుగా బండలుగా, కొండలమీదనుంచి దొర్లి అతని తలమీద పడుతున్నయ్. ఆబ్యాంకులో ప్రతికన్నూ అతన్ని చూసి అనవసరంగా జేవురించుతోంది — ఈపాడు డిగ్రీమూలంగా ప్రతిపన్నూ పరుషవిషాలనే క్రక్కుతోంది.

"బీ—కామ్—" ఈ రెండు అక్షరాలూ స్ఫురించగానే ఆబ్యాంకులో పనిచేస్తున్న వాళ్లందరికీ చిరాకెత్తుకొస్తుంది —వాళ్లంతా పాతప్రైమరీ సర్టిఫికెట్లు పుచ్చుకుని, తఖ్తు లాక్రమించి కూర్చుంటే, ఇవ్వాళ తనొక బీకామ్‌ను అంటూ బయలుదేరితే ఎలా యేడుస్తుంది!.

అసలు యితనికి ఉద్యోగం యివ్వటానికే వల్లగాదని సెక్రటరీ డైరెక్టర్లమీటింగులో దెబ్బలాడాడు. "కృష్ణరావుకు పాపం డిగ్రీ అయితేమాత్రం పెద్దదే వుందికాని, దస్తూరీమాత్రం కుక్కలు — నక్కలు దేకినట్టుంటుంది, అన్నాడు. టైపిస్టు ఉద్యోగానికి

దస్తూరితో నిమిత్తమేమిటని, యీ సలహా త్రోసివేసి, కృష్ణారావుకు ఉద్యోగం యిచ్చారు, డైరెక్టర్లు.

సెక్రటరీకి తలవంపులైంది. ఈఘటన తమ పై అధికారిని అలా డైరెక్టర్లు నిర్లక్ష్యం చెయ్యటం అతని అనుచరవర్గానికీ అలానే అనిపించింది. కృష్ణ రావును బ్యాంకిలోనుంచి తరిమివేయ లేకపోతే తన తెలివెందుకు తగులెట్టనా ? అనుకున్నాడు. యెక్కౌంటెంటు డవాలీ బంట్రోతు దగ్గరనుంచి దస్తు పరాఫ్ దేఖీలూ యుద్ధసన్నద్ధులయ్యారు. కృష్ణరావును బ్యాంకిలోనుంచి తరిమితీరాలి. దీనికి కావలసినయీ గంధరాయణమంతా నడుస్తోంది. రెండుమార్గాలు— కృష్ణరావు అసమర్థుడని నిరూపించి సాగనంపించటం మొదటిపంథా; కసుక్కు కసుక్కున, ములుకులుగా గుచ్చుకుని, పైకి రక్తాలు చిమ్మకపోయినా, హృద యాన్నంతా పచ్చిపుండుచేసివేసే, విషాక్తాలైన, సూటీ పోటీ కుళ్లుమాటలు విసిరి, తనంతటతను, అతనే బయ టికి వెళ్లిపోయే పరిస్థితి కల్పించటం రెండవపద్ధతి.

* * *

'ట్రయ్ య్ య్ య్ య్!... ట్రయ్ య్ య్ య్ య్ !...' మంటూ కంచుగొంతు బ్రద్దలు కొట్టు కుంటోంది, ఆ టేబుల్ బెల్ ;..."లేచిరావేం ?"... అని మళ్లా మళ్లా గొంతు చించుకుని బొబ్బలు పెడు తోంది—అధికార కంఠంతో—కృష్ణరావు కదల బోయాడు—"ప్రాణంలేని ఆ కంచుముక్కకు నీవు బానిసై కంగారుపడి కాళ్లు తొక్కుకుంటా నేమిటి? ...వెళ్లకు! కూర్చో!" అన్నది అతనిహృదయం.

కూర్చున్నాడు—

"నీకేమన్నా పిచ్చెత్తిందా ? వెళ్లకపోతే నీ ఉద్యోగం వూడుతుంది. నీ పై అధికారి పిలుస్తు న్నాడు—పో! వెళ్లు" అన్నది మనస్సు—

హృదయం — ఎక్కౌంటెంటు పిలిస్తేమాత్రం నువ్వెందుకు వెళ్లాలి? అతనికి నీ వెందుకు బానిసవై పడివుండాలి ? అతను నీకంటే యేమన్నా పెద్దచదువు చదువుకున్నాడనా?...నీ కంటే పెద్ద తెలివి తేట లున్నాయనా ?

మనస్సు—లాభంలేదు—చెడతావు—నీహృద యాని కిక్కడ తావులేదు.

"ట్రయ్య్య్య్య్" మంటూ మళ్లా గొంతు చించుకుంటోంది—

ఎక్కౌంటెంటు గదిలోకి కృష్ణరావు పాదాలు నెమ్మదిగా నడిచినై...

ఎక్కౌంటు—ఏమయ్యా!- యేం-చెముడా ?

కృష్ణరావు—మెషిన్‌లో కాయితం తీసి అవ తల బెట్టి వస్తున్నాను సర్ !

ఎకౌం—హూఁ-(ఒక ఎలుగొడ్డుమూలుగు- ఒక కాయితం ముక్క తీసి బల్లమీద విసిరికొట్టి) దీనికి కాపీ యేదీ తగులెట్టి!

కృష్ణా—కాపీ కావాలని అనుకోలేదండీ...

ఎకౌం—బి. కామ్.ప్యాసయ్యానసే టెక్కు దప్ప, పనిపాట లే మన్నా తెలిసేడిస్తేనా!

కృష్ణా—కొత్తవాణ్ణవటంచేత తెలియ లేదు. క్షమించండి. కాపీ కావాలని యెవ్వరూ నాకు చెప్పారుకారు.

ఎకౌం—స్టుపిడ్ టీ...

"చిత్తం"—అనలేదు కృష్ణరావు...అతని హృద యం మెదడులోకి వెచ్చని రక్తాన్ని చిమ్ముతోంది క్రిందినుంచి.

ప్రక్కనున్న వరండాలో సిగరెట్టు దమ్ము గొడుతున్న సెక్రటరీ కులుక్కుంటూ లోపలికి వచ్చి— "మనవాణ్ణి యివ్వాళ మందలించకండి. మాంచి హుషా రుగా వున్నాడు ఇవ్వాళ" అన్నాడు- కృష్ణరావు భుజంమీద చెయ్యివేసి తట్టుతూ.

ఎకౌం—ఏమండీ కథా?—

సెక్రటరీ—మీకు తెలియదా యేమిటి ? మన వాడి భార్య ఇవ్వాళ సాయంత్రం ఆరు గంటలకు రేడియోలో పాడుతుంది—

ఎక్కాం—ఎమిటీ ?... ఆవిడ రేడియోలో పాడేటంత బాగాపాడుతుందా యేమిటి? — నాకు తెలియదండీ.

సెక్రటరీ—ఆవిడ పెద్ద పెద్ద కచేరీలుకూడా చేస్తుందండీ. చాలా బ్రహ్మాండంగా పాడుతుందీ... అసలు మీకు తెలియకపోవటమేమిటండీ...'వసంత కోకిల శ్రీమతి కళ్యాణి—అంటారు అవిణ్ణు—చాలా పెద్ద గాయకురాలు లెండి; సునాయాసంగా నెలకు అయిదారు వందలు సంపాదించి అవతల పారవేయ గలదు.

ఎక్కాం—అరె! కళ్యాణి నీ భార్యాటయ్యా! చెప్పావు కావేం. ఇంకేం...అదృష్టవంతుడివి.

కృష్ణ—నా యీ బ్యాంకి బానిసత్వంలో ఆవిడ ప్రసక్తి తేవటం అనవసరం. మీ రాథోరణి మానాలని కోరుతున్నాను.

ఎక్కాం—[తలతిక్కగా] బ్యాంకి వ్యవహార మేనయ్యా! నేను మాట్లాడుతున్నదీనూ...ఇట్టా చేతా వాతాగాని పనులుచేసి మా ప్రాణాలు కొరక్కపోతే... శ్రుతితంబురాపుచ్చుకుని ఆవిడ వెనక కొంగట్టుకు తిరుగుతే యీ మాత్రం కాలక్షేపం నీకు జరక్కపోయిందా ? అని.

"పటప్ !"—

ఎక్కాం బెంటు గూబ కదిలిపోయింది ఆ గూబ కాయతో—

3

"నా చిట్టితల్లికి ముఖ్ మల్ గౌసెన కుట్టించుకురా నాన్నా! ఆ సిల్కుది బాగుల్లేదు, గరుగ్గావుంది" అన్నది, కళ్యాణి.

"చిట్టితల్లి పుట్టనీ — కుట్టించుకురానూ ... అయినా నీ కూతుర్ని మార్వారీ పద్ధతిని గౌసెనవేసి పెంచుతావా యేమిటి ?"

పగలబడి నవ్వుతూ—"సరేసరే, నేనిప్పుడు నీకు మనమరాల్నెక్కడ కనేది?...(నవ్వుతూ) బలే బలే! ఈ మాట బాగానేవుంది...నేనొక చిట్టిపాపాయిని కనటం...అదేమో...'క్యాఁ క్యాఁ క్యాఁ' అంటూరాగాలెట్టడం...నువ్వుదాన్ని బుజాన వేసుకుని 'ఇచ్చిచ్చిచ్' అంటూ సమదాయించటం...ఇదంతా బాగానేవుంది..." చక్కన కంఠంమార్చి, కొంచెం కోపాన్ని అభినయిస్తూ "ఏమిటినాన్నా, మరీనూ "ఇల్లాంటిమాటలు" — మూతి ముడుస్తుంది—వాలు జడ చివరబట్టుకుని చివాల్న భుజంమీదుగా ముందుకు ఎగరవేసి జారలాగుతూ—

"నువ్వన్నమాటేగాని?"

అయ్య బాబోయ్! నే నిప్పుడు పిల్లల్ని కంటానన్నానా?"

"చిట్టి పాపకు గౌసెనకావాలన లేదూ?—"

"అయ్యో వెర్రిబాగుల తండ్రీ! చిట్టి తల్లంటే నీకు అర్థం కాలేదన్నమాట..."

చకచకాపోయి తివాసీమీద పెట్టివున్న వీణను ఆప్యాయంగా కావిలించుకుని ఒక చిన్నముద్దు పెడుతుంది దానికి.

"వీణసంగతా?...మనమరాల్ని కంటావేమో... కాస్త బుగ్గగిల్లి యేడిపించుదామని గంపెడాశబడ్డాను, వట్టిదేనా ?"

"ఎప్పుడు కుట్టించుకువస్తావూ ?"

"ఇదుగో...వెడుతున్నాను"

"మరే! నాన్నోయ్! ఇక్కడ దంతపు నగిషీ కాస్త వూడిపోయింది నాన్నా"

"సరే బండి తీసుకువచ్చి బజారుకు తీసుకువెళ్లి బాగు చేయించుకు వస్తాను."

ఎందుకూ...పనివాణ్ణే ఇక్కడకువచ్చి బాగు చెయ్యమనరాదూ ?"

"అతను చాలా పెద్దపనివాడు. ఈకాస్తభాగ్యానికి ఇంటికి రమ్మంటం యేమంత బాగుంటుంది ?

"పోనీ అక్కర్లేదు లెండి. అలానే సరిపెట్టుకుంటాను"

"అదేమిటే!"

"నా చిట్టితల్లి నాదగ్గర లేకపోతే నాకు తోచదు బాబూ"

"ఎంతసేపమ్మా. అరగంట భాగ్యం.

"అహహా! అరగంటకాదు గదా. అరనిమిషమైనా వల్లగాదు బాబూ. నాకు అదేమిటో చికాకుగా వుంటుంది. నా కసలఖ్ఖర్లేదు.

"సరే పోనీలే అతన్నే తీసుకువస్తాను"

౪

రాణా ప్రతాప్ కోరమీసం చిమ్మెటకొరికింది. మొఖాన గంటుపెట్టుకుని చికాకుగా కూర్చున్నాడాయన. ఇది కృష్ణరావు గమనించనే లేదు. ఆ పటంమీద ఈ ప్రక్క నుంచి ఆ ప్రక్కకు "కళ్యాణి తంబురా"-అన్న అక్షరాలు జ్వాలాతోరణం లా భగభగా మండిపోతున్నట్టు కన్పించుతున్నయ్ అతనికి-రక్తారుణజ్వాలలుగా—

అతని పురుషకారాన్నే అవమానించటం ఆ వాక్యం. బ్యాంకిలోనుంచి పొమ్మనవచ్చు. కళ్యాణీ వెంట తంబురాపుచ్చుకు తిరగమని కూయటానికి వాడికేమిటి అధికారం?...అతని గుండెల్లో గంధకధృతి ఒలికినట్లైంది.

ఆమాటల్లో యేమంత తప్పువుందనీ?... తన భార్య సరస్వతిలా కూర్చుని, వీణ వాయించుతూ ప్రజా గౌరవాన్ని చూరగొంటుంటే...తను తంబురా శ్రుతి మీటుతూ వెనక కూర్చుని ఆమె గౌరవంలో భాగం పంచుకోటం...అది...అవమానకరమేనా?... అల్లాంటి మహద్భాగ్యం తమ జీవితాలకు లేకపోయిందని ఎన్ని యువకహృదయాలు కించపడటంలేదు. వాళ్లంతా లేకిమనుష్యులనేనా ఇతని అభిప్రాయం?

అది అవమానశల్యం గాకపోతే, ఎక్కౌంటెంటు ఆ వాక్యాన్ని అలాశూలంలా తన హృదయంలో కస్సునదిగవేసి అంత బాధ ఎలా కలిగించాడు?—

ఎక్కౌంటెంటు మాటలు అర్థంలేని పిచ్చిమాటలేమో?

అర్థంలేకపోవటమేమిటి?... అర్థంలేకపోతే తన్నామాటలు ఎందుకంత కలవరపరుస్తాయి. తను మాత్రం ఎందుకంత తొందరపడవలసివస్తుంది?—

పాపం...ఎక్కౌంటెంటుమీద, తను, కుర్రతనంగా, చెయ్యిచేసుకుని, అనవసరంగా ఆయన్ను అవమానించాడేమో?

చట్! తొందరపడటమేమిటి?— కళ్యాణి వెనక తంబురామోస్తూ బ్రతకమని తన్ను వాడు ఎంత పలగాకితనంగా కూశాడు?...కాలసర్పంలా మునిపంట కాటువేశాడు...కాటులో విషంలేదని హృదయానికి నచ్చచెప్పుకుని శాంతంగా బ్రతకాలనిచూస్తే మాత్రం ప్రయోజనమేమిటి?...ఒక చెంప ఆ విషానలజ్వాలలు ఆపాదమస్తకం ఎగబాకి మంటలు బుట్టించి, తన్ని భస్మీకరించి వేస్తుంటే?—తన రక్తనాళాల్లో హాలాహలం భుగభుగలుగా పొంగులు రేసుతుంటే?

మనస్సును కొంచెం శాంతిపరుచుకోటం యెందుకైనా మంచిదేమో?...

శాంతి! శాంతి!—అర్థంలేని పిచ్చిమాటలు... వాణ్ణి యింతింతింత ముక్కలుగా చిత్రవధచేసివేస్తే మటుకు తన హృదయానికి శాంతి గలుగుతుందా?—

కుపితమానవహృదయం, ఆకాశాన్ని అంటిపెరిగిన ప్రమాదకరమైన అగ్నిపర్వతం—శిఖరాన శిఖిరేఖ జేవురించనేరాదు...జేవురించితే?...

అవును జేవురించగూడదు ... అసలు అగ్నికుండాలుగా యీ మాటలు ఇలా ఎందుకు తయారైనై? ఎక్కడిదీకీల.

'కళ్యాణి వెనకతంబురా'—తనకేం ఖర్మం... తను చిన్నప్పటినుంచీ ఎంత కష్టపడి చదువుకున్నాడూ? ఎంత ప్రతిభ సంపాదించాడు. ఇదంతా వ్యర్థమేనా?...పోనీ వ్యర్థమైతేమాత్రం తనకేంలోటు... రెక్కలకష్టంచేసి బ్రతకవలసిన అవసరంకూడా తనకు

లేదే?...కాస్తో కూస్తో తండ్రి తనకు ఆస్తి ఇచ్చే వెళ్లాడు. తన జరుగుబాటు కేంలోటు...ఏమిటా వెధవ కూసిన పిచ్చికూతలకు అర్థం?

"కళ్యాణి" — కళ్యాణి మాటెత్తాడేమిటి? 'కళ్యాణి'...యీ అక్షరాల్ని జ్వాలారేఖలుగా గుప్పన తన హృదయంలోకివూది ఒక్కసారి అలా ఎలా దహించివేశాడు. ఈ అక్షరాల్లోనుంచి ఇంత అగ్ని ఎలా పుట్టించాడు?...

కళ్యాణి తనభార్య...తన్ను ఎంతో ప్రేమించుతుంది. తన్ను ఎంతో గౌరవించుతుంది; కళ్యాణి హృదయం తనలీలావసథం...వెలుగులమేడ. అతను బాహ్య ప్రపంచాన్నంతా విస్మరించి...సుఖంగా కన్నుమూసే హంసతూలికల పట్టుపరుపులూ, సుఖతల్పం, ఆవెలుగులమేడలో వెన్నెల తెరలచాటునేగా వున్నయ్—ఇది తనకు అవమానకరంగా ఎత్తి చూపదగిన విషయంకాదే?...అసలు...తనూ, కళ్యాణీ హృదయాలు పెనవేసుకుని మీన మిథునంలా యీదులాడుతున్న ఆ మధురవాహిని లోతులు అర్థం చేసుకోగలగటానికి, వాడి కేంతాహతువుంది?...

మరి...'తంబురా' — ఛీ ఛీ కళ్యాణి తన్ని తంబురా యెందుకు మొయ్యమంటుంది?

ఒకవేళ మొయ్యమంటే?

మొయ్యమంటే మొయ్యనంటాడూ!...యేముందిందులో...ఏమిటా లేకి వెధవకుంటికూతలకు అర్థం మరి?...

మోస్తేగాని వీల్లేదని పట్టుబడుతుందేమో?...

ఎలా పట్టుపడుతుంది?...కళ్యాణి తన భార్య తన్నలాశాసించటానికి కళ్యాణికి తనమీద యేమిటి అధికారం?...కళ్యాణి తన భార్య...తన కనుసన్నల్లో మెలుగుతూ తన అధికారంలో పడి వుండవలసినది...కళ్యాణి పెంకితనం తనముందేంనాగుతుంది?

అలా, వుండనంటుం దేమో?—

ఉండనంటుందీ!...ఉండనంటే తను తిండి పెట్టక మాడ్చి వేస్తాడు గాని ఊరుకుంటాడా...తను ఎవరు?...భర్త.

ఓహో!...ఇది లాభంలేదు అలా తను చెయ్యలేదు...కళ్యాణి అందరు స్త్రీలకు మల్లేకాదు...కళ్యాణికి తిండిపెట్టకుండా మాడ్చి చంపటం...తన చేతిలో వున్న పనిగాదు...కూటికీ గుడ్డకూ కళ్యాణి తనమీద ఆధారపడిలేదు...ఈ విషయం తనెప్పుడూ ఇంతలోతుగా ఆలోచించలేదు...అవును తనకూ కళ్యాణికీ మధ్య ఇది ఒక భయంకరమైన ఆఖాతమే. ఇది తను ఇంతవరకూ అర్థంచేసుకోలేకపోయాడు...ఎక్కంటెంటు యీ విషయాన్ని తనకంటే ముందు ఇంత సున్నితంగా చొచ్చుకుపోయి ఎలా అర్థం చేసుకోగలిగాడో?...ఏమో ననుకున్నాడు గాని వాడి తెలివితేటలు తనకు తలకుమించినవిగానే వున్నయ్.

కూటికీ గుడ్డకూ కళ్యాణికి తన ఆసరా అక్కర్లేదు. తన కాళ్లమీద తను నిల్చోగలదు. కావలిస్తే తనవంటి వాళ్లకు పదికి ఇంత తిండి పారవేయగలదు గూడా—అదేగా- 'సునాయాసంగా అయిదారు వందలు సంపాదించి అవతల పారవేయగలదు' అంటూ కళ్యాణి ప్రక్కన తన అసమర్థతను ఎత్తిచూపుతూ దెప్పిపొడిచాడు సెక్రటరీ—

అవును; కళ్యాణి తన చెప్పు చేతల్లో వుండవలసిన అవసరం యేమిటి?...

ఏమిటీ!...తన భార్యకు తన మాట వినవలసిన అవసరమే లేదూ?...ఎంత తలవంపు...ఇది అతని పురుషహృదయం భరించలేదు...ఇది తను సహించడు ...ఈ విషమపరిస్థితిని ... వెంటనే ... నిర్మూలించుతాడు...కళ్యాణి తన్ని లెక్కచేయకుండా నిర్లక్ష్యం చేసే దుస్థితి అది భయానకం...జీమూతాలు జడలు విరబోసుకుని గంగశివాలాడే కాళరాత్రివంటి మృత్యువు కంటే అది భీభత్సం...ఉక్కుకోరల బ్రహ్మరాక్షసి, ఎరకోసం, నరకద్వారంలా నోరు తెరుచుకుని, చీకటి మబ్బుల పొదలమాటున నక్కి, పొంచి కని

పెట్టుకు కూర్చుంది...పొరపాటున ఆదారిని అటు వస్తే...తనజీవిత సర్వస్వాన్నీ...దడాల్న పట్టి మ్రింగి వేయాలని తను జీవితంలో ఎంతో అశ్రద్ధగా నిద్దర మత్తుతో నడుస్తున్నాడు...ఇది గమనించుకోకుండా!

అతనిక ఊరుకోడు...ముందుగానే తొందర పడతాడు...తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోటానికి అవసరపడితే తన ప్రాణాన్ని పణంగాబెట్టి పోరాడ తాడు ఈ విషమసంఘ పరిస్థితులతో.

గొఱ్ఱెపోతుపోయి కొండను ఢీకొంటే!...కళ్యాణి ముందు తనెంత; కళ్యాణి ఒక పెద్ద బంగారు కొండ...ఆకాశాన్ని అంటి పెరిగిన మేరువుపర్వతం; తనూ?—గొల్లవాడు ఉన్నికూడా కత్తిరించుకుపోయి ఆ పర్వత చరియల్లో పూరిమేయాలిసిన ఒక చిన్న గొఱ్ఱెపిల్ల!...తన ఆడదానిప్రక్క-తను ఒకగొఱ్ఱెపిల్ల... గడ్డిపోచ—

కాక మరేమిటి?...ముప్పైరూపాయిల ముండ మోపి కూలికి ప్రపంచం తన్ని అడ్డమైన పిచ్చికూతలూ కూసింది. కళ్యాణిని అలా మాట్లాడటానికి ఎవడికి దమ్ములున్నయ్...అసలు కళ్యాణి అలా ఒకసారి వీణ పట్టుకుంటే చాలు,...ప్రపంచానికి పిచ్చెత్తిపోయి, బంగారు రాసులు పాదాల దగ్గిర గుమ్మరించి "దయ వుంచి స్వీకరించండి" అంటూ బ్రతిమిలాడుతుంది.

తను కళ్యాణిని అదుపుచేస్తానంటే అసలు దిక్కులన్నీ పరిహసించి నవ్వుతాయల్లేవుంది.

నవ్వుతే నవ్వనీ...తను అదుపుచేసి తీరతాడు ...కళ్యాణి తనభార్య...దాన్ని తన యిష్టంవచ్చి నట్టు శాసించుతాడు...ఇందులో ఒకడికి జోక్య మేమిటి?—కళ్యాణి తన ఆడది. ఎవడికోసం పడి వుంటుంది—

పడివుండనంటే?—

పడివుండనంటే...

తను మగబిడ్డ యేదుండగాన్ని చెయ్యలేదు.

౫

"గగనానికి ఇలకూ, బహు

దూరం బనినాడో..."

"హూ"—అన్న దీననిశ్వాసం...

"హూ"—అంటూ అనుకంపించినై...ఆవీణ తంత్రులు. పాపం ఆవీణతీగలు కళ్యాణి హృదయ స్పందన శాసనాలను అతిక్రమించి ఎప్పుడూ నడుచుకో లేదు...అతఃపూర్వం; యీ దీననిశ్వాసాన్ని అను కంపించటంలో...ఒక ధ్వనికి మారు మరొకటిగా... గజిబిజిపడ్డయ్. ఆ రాగస్వరూపమే మారిపోయింది. సిగ్గుపడ్డ కళ్యాణి తలెత్తి తండ్రివంక చూచింది... ఆయన అదోలాదిగులుగా—కళ్యాణికి భయంవేసింది ... తడబడుతున్న పాదాలు తండ్రిదగ్గిరికి చేరు కున్నాయి...

"ఏమిటి నాన్నా?"...

వెన్నముద్దతో సహా దొంగకృష్ణుడు యశోదకు దొరికిపోయాడు.

"ఎబ్బే ... ఏముంది ... ఏమీలేదే"—అంటు సర్దుకోబోయాడు. ఆయన నేత్రాలు కన్నీటి పొర జాలులో చేపపిల్లలులా మిలమిలా మెరిసిపోయినయ్...

"అమ్మ దొంగా!...అదేం..."

"ఏదీ...నేను ఏడవందే?"—సూత్రం తెగిన ముత్యాలపేరులు ... కనుకొలకులవెంట జోటజోటా కన్నీరు.

"నాకూడా... యేడుపొస్తోందినాన్నా"— నా ముఖంలో ఆవిడ ముఖంచూసుకుని అమ్మనిమరిచి పోయానని గొప్పలు చెప్పావ్; అన్నీ వట్టిమాట లేనా?..."

"అమ్మకోసంకాదు నాయనా!...కళ్లు బాగా వేడిజేసినట్టునై...దానికోసం నేను దుఃఖపడవలసిం దేముంది? [చిరునవ్వు బలవంతాన తెచ్చిపెట్టుకుని] అసలు ఆ యిల్లాలు మానవదేహంతోనే బ్రతికవలసి వుంటే...ఆ అమాయిక హృదయం బరువులెత్తే

ఈ మాధుర్యాలను భరించగలిగేదేనా...ఆది మొదట్నుంచీ నాకంటే ఎలాగైనా తెలివితేటలు గల మనిషి...అందుకనే ముందుగా జాగ్రత్తపడి...ముఖం తప్పేసి...స్వర్గధామానికంటూ వెళ్లిపోయింది...అది నాకంటే ఎలాగైనా జాగ్రత్తగల మనిషి మొదట్నుంచీ. అసలూ...ఆవిడకోసం నేను పరితపించి లాభ మేమిటి? ...తెలివిగలవాళ్లు పరీక్షలో కృతార్థులై త్వరత్వరగా పైతరగతిలోకి వెళ్లిపోతారు. నాబోటి బండబ్బాయిలు తప్పిపోయి చదివినతరగతే తిరిగి చదువుతూ తంటాలు పడుతూ వుంటారు...ఈ మానవత్వంలో పవిత్రతకు ఒక అవధివుంది...దాన్ని అధిగమించితే ఇక్కడ వుండటానికి వీల్లేదు. గౌతమదేవుణ్ణి గర్భాన ధరించుకున్న మహాపుణ్యానికి...వస్తేనే గాని వీల్లేదని, దెబ్బలాడి మాయాదేవిని పుష్పవిమానంలో ఎక్కించుకుని, బలవంతాన లాక్కుపోలేదూ—దేవతలూ—యీ మానవలోకంనుంచీ?—మీ అమ్మ అంతే—దివ్యగాంధర్వాన్ని ప్రసవించుకున్న మధుర హృదయానికి...మానవత్వంలో నా ప్రక్కన ఇక్కడ తావు కావాలని కోరటానికి నేనేం పిచ్చివాణ్ణనుకున్నావా?"—ఏదో ప్రపంచంలో నుంచి లా, చిరునవ్వు నవ్వుతాడు.

"అవున్లే—నన్ను గొప్పదాన్నని ఉబ్బేసి' అసలు విషయం మరిపించాలని చూస్తున్నావ్, అలా వీల్లేదు—చెప్పి వెయ్యాలిసిందే."

"అమ్మకోసంగాదు సరా?...మొదటే చెప్పానుగా అది ఒక పిచ్చిమాటనీ...అదొక తెలివితక్కువ ...అనవసరంగా కలవరపడ్డాను...ఏమీలేదు తల్లీ ..."

"ఏమిటినాన్నా!"—అని మూతిముడిచి, భుజం మీద పడుకుని మారాం జేస్తుంది.

అయోమయంగా "నీ పక్కకింద పెట్టాను... చూళ్లేదా ఇంకా...అతను ఉత్తరం వ్రాశాడు... ఎల్లుండి వచ్చి తీసుకువెడతానని"—

"చూశానునాన్నా...ఏం?"

"పిచ్చిమాటని మొదటే చెప్పానుగా...నీసంగీతం వినకుండా బ్రతకలేనని యేమిటో...భయం వేసింది...తెలివి తక్కువగాక మరేమిటి."

ఓహో...అదా" — పోనీ మరొక నెలవుండి పంపుతానని వ్రాయలేక పోయారూ?"

"అలా అతనికి అడ్డుచెప్పటానికి నా కేమిటి అధికారం? ఎప్పుడైనా వున్నదేనాయె...అయినా నీ హృదయం రెక్కలు విచ్చులుకుని అతణ్ణి చేరుకోవాలని ఉబలాటపడటం అది నేను ఇంకా గమనించలేదనే?"—తండ్రి తన్ని యెప్పుడో పట్టివేశాడని సిగ్గుపడ్డది, కళ్యాణి; చెక్కిళ్లు ఎర్రబడ్డయ్.

"పోనీ...నాన్నా! ఇక్కడ యేముంది? ఒంటరిగా ఇక్కడ వుండకపోతే, ఈ యిల్లు అద్దెకిచ్చేసి నీవుకూడా నాతో వచ్చేసి వుండిపోతే బాగుండదూ?"

"అలా నేను చేయలేను నాయనా!"

"పోనీ...ఆయన్నే ఇక్కడ వుండమంటే?"

"ఛీ! తప్పు!" చరాల్న కత్తిరించినట్టుగా, మందలించాడు.

"మీ రిద్దరూ సుఖంగా వుంటే నా కదిచాలు. అంతకంటే అతన్ని నేను మరేమీ యాచించను... మరేం ఫరవాలేదు...నెమ్మదిగా అలవాటు చేసుకోగలనులే...ఈ విషయం నీవు బెంగగా ఆలోచించకు ...సంతోషంగా వుండు...బిక్క ముఖంతో అతనికి నువ్వు కనిపించటం అది నాకు ఇష్టంలేదు...ప్రయాణానికి కావలసిన యేర్పాట్లు చూస్తున్నాను.

"శ్రుతి తంబురా ఒకటి పెద్దది కొనుక్కురా నాన్నా...కొంచెం మంచిదిగా చూసి."

౬

ఉగాది—

"క్షమించాలి—వసంతకోకిల శ్రీమతి కళ్యాణి గారి వీణావాదనం ఉగాదికానుకగా అర్పించుకుంటామని లోగడ ప్రకటించాం. వారి అనారోగ్య కారణంగా అలా చేయలేకపోయాం. ఇప్పుడు మా స్టేషన్ విద్వాంసులు ఒకరు వీణ వాయించుతారు—

అంటూ చిన్నకుమార్పణ చెప్పుతున్నారు రేడియో స్టేషన్‌నుంచి...

సొంతసెట్టులేని ఒకపేదరసికుడు, పార్కులో కూర్చుని ఈమాటవిని నిరుత్సాహపడి కాళ్లీడ్చుకుంటూ ఇంటికి చేరుకుంటున్నాడు... "అయ్యో పాపం! ఆ తల్లికి జబ్బేమిటో ?...!" అనుకుంటూ.

* * *

"చాలా చీకటిగా వుంది కళ్యాణీ!...... ఊపిరాడటం లేదు......వద్దువద్దు...చిమ్నీ అలా హెచ్చించకు...ఇప్పటికే అది కొరివిదయ్యంలా మండుతోంది...దాని వంకచూస్తే గుండెలు కొడిగట్టి పోతున్నట్టుగా వున్నయ్...సొంతం ఆర్పివెయ్యి... అది కొడిగట్టి మండినకొద్దీ జడలు విరబోసుకుని చీకటి పిశాచాలు గదంతా తాండవాలు త్రొక్కుతున్నయ్...

గదంతా అంధతమసం...ఆకాశంలో నన్నా యేమైనా కొంచెం వెలుగుందేమో?...కిటికీపై రెక్కల్లో ఒకటి తెరిచాడు—కారుమబ్బుల కాళరాత్రి... జీమూతాలు పరుగులు తోలుతున్నయ్, ఆకాశమంతా ...ఆకాశంవంకచూసి హడిలిపోయిన కాకికూన కళవళిస్తూ, తల్లి కాకిరెక్కలోదూరి, తల్లిని లేపుతోంది ...దొడ్లో బాదం చెట్టుమీద.

"మ్చ!...ఈ చీకట్లో ఇక బ్రతకలేను"...నిరుత్సాహంగా కిటికీ రెక్కమూస్తాడు...

"హూ..." అన్న దీననిశ్వాసం;—చీకటి దేవత గదిలో మెసిలినట్టైంది. కళ్యాణి మునివ్రేళ్లు నిస్పృహదేవత నిశ్వాసాలులా...ప్రాణంలేని గాలితీగెలులా అతని భుజాన్ని తాకినై.

"కళ్యాణీ! పాపం నువ్వువచ్చి రెండుమాసాలయినట్టుంది."

"హాఁ"—

"మీనాన్న దగ్గిరికి పంపనా? పదిరోజులు వుండివద్దువుగాని"

"అపచారం?..."

"అబ్బా! అదేంమాట...గుండెల్ని అలా మెరుపు కత్తిలో సర్రన...కోసుకుపోయిందీ?... అపచారమనిగాదు. నువ్వు చాలా జబ్బుగావున్నావ్— మీనాన్నమీద బెంగగా వుందేమోనని—"

"నేనేం పసిదాన్ననా?...గంపెడాశలు ఒడిగంటి రాజనాలులా మూటగట్టుకుని మీ పాదాల దగ్గరకు చేరుకున్నాను. మీరాకకు యుగయుగాలుగా, ఎడతెగని చీకటి రాత్రులెన్నో ఎదురుదారులు చూచాను. నన్ను తరిమి వెయ్యాలని చూడకండి... మళ్లా ఒంటరిదాన్ని చెయ్యకండి, ఒంటరిగా బ్రతికే తాహతు ఇప్పుడు నాకులేదు. నేను చాలా అలసిపోయాను...నాకు చిన్నమెత్తు ప్రాణమైనా లేకుండా పోయింది. నా కాళ్లు గుడ్డపేలికలల్లే గాలిలో తేలిపోతున్నై...కాలూది నిల్చోలేకుండా వున్నాను. ఇప్పుడు నాచెయ్యి జారవిడువకండి...నిల్చోలేను... మీ తొడమీద పడుకుని...ప్రాణం విడుచుకోనివ్వండి"—

కళ్యాణిని తొడమీదికి తీసుకుని, రేగిపోయిన జుట్టు సరిచేస్తూ—

"నీవు నా ప్రక్కన నిల్చివుంటే నా హృదయంలో వెండివెన్నెలలు వెల్లివిరిసిపోయేవి కళ్యాణీ!... కాని...ఇప్పుడు...నా ఆనందచంద్రుడు మసకమసకవేసి పోయాడు...కారుమబ్బులచాటున. ప్రాణరహితమైన నిస్పృహదేవత చీకటిక్రీనీడలా అయోమయంగా నీవు నా జీవితంలో మెసులుతూ వుంటే...నాకంతా ...చీకటి చీకటిగా...కారుమబ్బుల కాళరాత్రిలా కీచుమంటూ...జిమ్మని దుఃఖం ముసురులు వేసి ముంచుకువస్తోంది:

"ఔను ప్రభూ! నేను దినదినం చీకటిచీకటిగా చివికి అంధకారపు ఆత్మలా అయోమయమైపోతున్నాననే యేడుస్తున్నాను. నాహృదయంలోకి తొంగిచూస్తే దీపాలు ఊది వేసిన నర్తనశాలలా అంధకారం ఆవలిస్తూ భయంకరంగా వుంది. నిస్పృహదేవత దుఃఖగీతిలో

కడలేని అశ్రురాల కంకాళంగా కాలి కావురు వేసి పోయాను. నిశ్శబ్దశోకగీతినై ప్రపంచావధులదాకా విషాదాన్ని చలిగుబుళ్లులా మోసులెత్తిస్తున్నాను... అభాగ్యురాల్ని—నాపుట్టుక భారతమహిళా లోకానికే అవమానకరం. భర్తజీవితానికి కావలసిన వెలుగు నివ్వలేని స్త్రీత్వం ఎంత నీచం...ఇది నాతండ్రికి తెలిస్తే...నన్ను కన్నందుకు ఎంత అవమానపడి అటమటించి యేడుస్తాడు...అయ్యో."

"భయపడకు కళ్యాణీ!... నీ హృదయంలో నాకింకా ఆశాకిరణాలు కనుపించుతూనే వున్నై. ...వాటి సహాయంతో...వెన్నెల బయలులోకి దారేమన్నా దొరుకుతుందేమో వెతుక్కుంటాను."

"లాభంలేదు ప్రభూ! దీపకళికను ఆర్పుకుని చీకటిగా వుందని బాధపడుతూ, అంధకారంలో తడుముకుని ఆయాసపడి లాభమేమిటి?"

"ఏమిటి కళ్యాణీ!... ఈ చీకటి కంతటికీ బాధ్యుణ్ణి నేననేనా?"

"మీ పాదాలు అంటుకోనీయండి...నేను బ్రతకాలని ఆశించుతున్నాను...కాపాడరూ?..."

"నాకు అర్థంగావటం లేదు కళ్యాణీ!...నేను నిన్ను చంపుకోవాలని చూస్తున్నానంటావా?...నేనిక్కడ నీకేం తక్కువజేస్తున్నాను?...పోనీ అంటే అను...నన్ను అలా నిందించటంలో నీకు శాంతి లేశమేదైనా లభించితే పోనీ అలానే అను...నేనేమీ అనుకోన్లే..."

"నా హృదయజ్యోతిని ఆర్పుకుని మీరు చీకటిలో బాధపడకండి...మన జీవితాలు అంధకారమయం చెయ్యకండి. నా జ్యోతిని నాలో వెలుగనియ్యండి. వెలుగుజిలుగుల లీలావసథాన్ని తమకు మళ్లా కట్టుకుంటాను...అనుగ్రహించండి."

"తిన్నగా చెప్పు కళ్యాణీ... నన్నిప్పుడేం చెయ్యమంటావూ?...నీ కోసం నేనే త్యాగం చెయ్యటానికి వెనకాడతాననీ?..."

"సంగీతం కళ్యాణి హృదయానికి ప్రాణజ్యోతి—వెలుగనియ్యండి...కళ్యాణిని బ్రతుకనియ్యండి... మీ జీవితానికి వెలుగుగీతికల వెన్నెల హారతులు అర్పించుకోవాలని యుగయుగాలుగా ఆశతో కనిపెట్టుకు కూర్చున్నాను. ఆశీర్వదించండి—నా హృదయజ్యోతి మీద శాసించిన ఆంక్షను తొలగించండి...జీవితాశ దాహంలా ఆర్చుకు పోతోంది...బ్రతికించండి."

"కళ్యాణీ!"—కఠోరంగా శబ్దించినై—ఆ డాబాతనాబీలు—

జీమూతాలు డొక్కలో మెసిలికల్లోల పెడుతుంటే...ఆకాశానికి పిచ్చెత్తిపోయింది...ఫెళఫెళా...ఫెళఫెళా!... పిడుగులురిమి భూమాతను భయపెట్టింది.

"ప్రాణంలేని క్రీనీడ బ్రతుకు ఇక నేను బ్రతకలేను ప్రభూ?"—

"కళ్యాణీ! ఇది పెంకెతనం...భర్తకు ఎదురు తిరగాలని చూస్తున్నావ్ — నీతంబురా నేను మొయ్యను."—

౭

శాపగ్రస్తుడై మూగవోయిన నారదుడు ముగ్ధహంసగా మారి, ముక్కు హృదయంలో గుచ్చేసుకుని, అరమోడ్చిన కళ్లతో, ఆకాశగంగలో ఆ వేదనతో ... అటమటించి పోతున్నాడు. తల్లి హృదయం తరుక్కుపోయింది...కరుణవాహినిగా పాదాలు కదిలివచ్చినై. నీటి పొరజాలుమీదుగా నడచి వెళ్లి కలహంసను కరస్పర్శతో కాస్త అనునయించింది. శాపవిమోచనాన్ని పొంది నారదుడు తల్లి పాదాలకు నమస్కరించాడు, మహతిమీద మధురాతి మధురంగా ఒక రాగమాలికను వాయించి తల్లి కంఠంలో కత్తెరదండగా వేస్తున్నాడు—

చలువచేసిన తెల్లదుప్పటిపరిచి పాలవెల్లిలా వుంది, ఆ పందిరిమంచం. మంచం నడాన మోకాళ్ల మీద తలవేలవేసుకుని శోకమూర్తిలా దిగులుగా కూర్చుంది, కళ్యాణి.

అకస్మాత్తుగా ఒక్క మెరపు మెరిసినట్లైంది కళ్యాణి హృదయంలో. గప్పున ఒక చుక్క గగన మండలంనుంచి రాలిపడి రప్పుమని వెలిగిపోయిన అమ వాస రాత్రిలా ఒక్కసారి తేజోమయమైపోయింది. ఆశాజ్యోతులన్నీ అంటుకున్నయ్.

"అవునవును...అవునవును"...అంటూ దబ దబా పక్కదిగి చరచరా సావట్లోకి నడిచింది... పాలవెల్లి మధ్యనుంచి ప్రవహించిన అమృతవాహినిలా-

"ఎక్కడికీ బయలుదేరారూ?" విదియచంద్రుడు ఒక్క ప్రాణంతో ఆ పెదవులమీద చిరునవ్వు చిలికాడు.

"మతి భ్రమణంకూడా కలిగిందల్లేవుంది అను కున్నాడు..."ఏమిటి కళ్యాణీ!" అంటూ కంగారుగా దగ్గరకు వచ్చాడు.

"తలంటిపోస్తాను-పోయించుకోరూ?"

ఏమి చెయ్యాలో తోచలే దతనికి...డాక్టర్‌ను పిలవాలా?...ముందు తండ్రికి టెలిగ్రామిస్తే...కలవర పడుతున్నాడు.

"ఇవ్వాళ నా పెళ్ళైనరోజు—పండుగ చేసు కుంటాను"

"అవును ఆమాట నిజమే...కళ్యాణికి ఈస్థితి లో ఇది ఎలా జ్ఞాపకం వచ్చిందీ"...అని ఆశ్చర్య పడుతున్నాడు "అయినా పెళ్లిరోజు పండగ చేసు కోటం...ఎక్కడా విన్లేదే" అనుకున్నాడు మళ్లా.

"ఏమిటి మాట్లాడరేం?"

"నిజంగానా?"

"నిజం, నిజం, రండి రండి" అంటూ కులు క్కుంటూవచ్చి, రెండుచేతులూ పట్టుకుని స్నానాల గది దగ్గిరికి తీసుకువెడుతోంది-మతిచెడి యేదో ప్రపం చంలోకి పోయినట్టుగా...అతని కిదంతా అయోమ యంగా వుంది.

* * * *

ఆ సాయంత్రం—

అతను క్లబ్బుకు వెళ్లబోతున్నాడు—సంపంగి నూనె రాచి పక్కపాపటి తిన్నగా తీసి, వంకెలు వంకెలుగా వచ్చేటట్టు క్రాప్ జాగ్రత్తగా దువ్వింది. "ముద్దులుమూటగట్టే ఇలాంటి ఉంగరాలజుట్టు నాకు వుంటేనా!...ఎన్ని ఎన్నిపిన్నులు బెట్టి తంటాలు బడ్డా...మ్చ్ లాభంలేందే" అని మురిసింది. కను బొమ్మల మధ్య చాదు చుక్కతీర్చి దిద్ది చెక్కిళ్లు పుచ్చుకుని వారగా సౌందర్యం చూసింది. "పెళ్లి కొడుక్కు బుగ్గన చుక్కబెట్టేనా?...పాపం క్లబ్బు లో వాళ్ళంతా వేళాకోళంచేస్తారని మీకు బిడియ మేమో...సరే ఇంటికి తిరిగి వచ్చిన తరవాత ఆ అలం కారం...అప్పుడు మటుకు తప్పించుకోటానికి చూడ గూడదు"—

"సరే! అలానేలే! నీ ముచ్చట నేనుమటుకు ఎందుకు కాదనాలి"—

పెళ్లినాడు తన తండ్రిబెట్టిన శాలంకండువా తీసి అతనిపైన కప్పింది.

"ఎబ్బెట్టుగా వుంటుందేమో...పోని ఇది వేసు కోకపోతేనేం కళ్యాణీ!"

"అలా వీల్లేదు...ప్రతీదానికీ మీ అధికారమే" ఉత్తరీయం కంగులు ముడిగా ముడిచి కడుతుంది.

"క్లబ్బునుంచి త్వరగా వచ్చెయ్యాలి...నే నీ లోగా సింగారించుకుని సిద్ధంగా కూర్చుంటాను"—

ఇవ్వన్నీ మంచిచేష్టలో—పిచ్చో అతనికి అర్థం కాలేదు. ఆలోచించుకుంటూ బయటకువెళ్లాడు.

* * * *

కళ్యాణి పెళ్లికూతురు సింగారం పూర్తిఅయింది. ...కాళ్లకు పారాణి, బుగ్గనిచుక్కతో సహా-పెళ్లి నాటి బనారసు చీర — కీల్జడా, కటిపైన ముద్దులు మూటగడుతూ చివర జడకుచ్చులూ, నిలువు టద్దం ముందునుంచుని నుదుట కళ్యాణం బొట్టు దిద్దు కుంది-రేఖలుగా, అద్దంలో అందం చూసుకుని ముసి ముసి నవ్వుల్లో మునిగిపోయింది.

౮

కళవళపడుతున్న హృదయంతో క్లబ్బునుంచి ఇంటికి వచ్చేస్తున్నాడు—చకచకా. వీణా నినాదాలు భోరుకొలిగిపోతున్నయ్ ఆవీధంతా. కళ్యాణి మధురకంఠం వెలార్చే గాంగనిర్ఝరులతో కలసి ఆవీణ పరుగులు తీస్తోంది యమునా వాహినిలా.

అవమానంతో అతనిముఖం నెత్తురుముద్దలా జేవురించి భీభత్సమైపోయింది.

ఆఁ! ఏమిటీ తిరుగుబాటు!" దబదబా మెట్లెక్కి—సావిట్లోకి వెళ్లాడు.

*　　*　　*

గానమధువీచికల
కలహంసవై—విరతి.
కన్నుమూయరసామి!
కళవళింపగనేల?...॥గా॥
ఉయ్యాల జొంపాల
ఊతునానాసామి!
వెయ్యారు గీతికల
విరిసిపోదునులేర...॥గా॥
ముత్యాలశాలలో,
మఃగుదమానసములో,
విరజాజి దీపికలు
వెలిగించితినిరార...॥గా॥

సోనలు సోనలుగా, తీపితేనెల మధురనినదాలు వానలుగా వర్షించుతున్నయ్ — ఆగృహమంతా, బంగారుపువ్వుల్లా సప్తస్వరాలూ జల్లులు జల్లులుగా, తడిసి ముప్పందుమై తడబడిపోతోంది కృష్ణారావు హృదయం.

అగ్నిరేఖను ఆర్పివేయాలని తూనీగబారులు తుటారాలాడుతున్నయ్ — రెపరెపలాడుతూ ఇంకా రెక్కలు, గాల్చాలని చూస్తోంది ఆశిఖిరేఖ—

ఆ వీణానినాదాలకు ప్రతికంపనాన్ని పొందినయ్ అతని హృదయతంత్రులు...కంపించి, కంపించి కల్లోలంగా కదలిపోతున్నయ్—ఆపినా ఆగక. అతనికి హృదయమే వున్నట్టు తోచలేదు. అతని హృదయమే ఒక విపంచిగా మారిపోయింది.

పరులవీణలనైతే పాషాణపాకంగా పట్టుబట్టి "పారవేస్తావా? చస్తావా?" అని బలవంతాన ప్రాణం తీసెయ్యొచ్చు ... తన హృదయమే తనకో వీణై కూర్చుంటే?—

వీణతంత్రులైదూ అయిదు సెలయేళ్లైనయ్. అతని హృదయంలో...కలకలా క్రమస్వనాలుగా, ముర్మరించుతూ — స్తాయినుంచి స్థాయికి లేడిపిల్లలులా చెంగుచెంగునదూకుతూ—గత్తుమీదగత్తు గమకం మీద గమకం పరుగులు దీసుకుంటూ ప్రవాహాలై పోతున్నయ్—అతని హృదయతంత్రులు.

ఎక్కడో...శతసహస్రార్బుదయోజనపరిదీర్ఘమైన యేదో అజ్ఞాతంలో...చీకటి చింతల చిక్కతోపులలోనుంచి గుడ్డి కొక్కిరాయి కళవళించినట్టు... "కళ్యాణి తంబురామోస్తావా యేమిటి?...ఎంత అవమానకరం...ఎక్కొంటెంటు ఏమన్నాడూ!" అంటూ మూగగొంతుతో మూలగబోయింది అతని మనస్సు.

ప్రజాహృదయంలో వెల్లువలై వెల్లి విరిసిన ఆ గంగా నిర్ఝరుల మధుఘోషల కల్లోలాలలో ఈ అపస్మారపుపక్షి గొణగటం ఎవరికి వినుపించుతుంది?

అతని హృదయనిర్ఝరులు గగనంకషకల్లోలంగా కెరటాలు ఎగరవేసుకుంటూ పాటలుబాడుతూ ప్రవాహాలైనయ్.

"ఉయ్యాల జొంపాల
ఊతునానాసామి?
వెయ్యారు గీతికల
విరిసిపోదును లేర
ఉయ్యాల...జొంపాల—"

ఆకాశం అవతలి కొసనుంచి యివతలి కొసదాకా ఊపిరాడకుండా—ఊపుమీద ఊపు...ఊగిపోయింది అతని హృదయం...హాయిలో అరమూసిన

కన్నులు అలాఅలా కొంచెం విప్పిచూసేసరికి. కళ్యాణి గది గడపముందు నిలుచున్నాడు—

"ముత్యాలశాలలో
ముగుదమానసములో
విరజాజి దీపికలు
వెలిగించితినిరార—"ము"

ఓరగా మూసివున్న తలుపులు ఒత్తిగిలించాడు. ఆనందతారల దివ్యదీపావళిగావుంది అగది. "ఆ! ఎవరా తేజోమయి." గాలికొదమలా నిశ్శబ్దంగా అడుగులు లోపలకి వేశాడు.

రాగరస సమాధిలో మునిగి రాజహంసిలా వుంది కళ్యాణి—ఆ ముఖంలో ప్రపంచాతీతమైన ఏదో ఒక దివ్యజ్యోతి—భర్త లోపలికివచ్చిన సంగతే గమనించలేదు కళ్యాణి. భర్త కళ్యాణిని పలుకరించనూ లేదు.

చాదు భరణిలోనుంచి కొంచెం చాదు తీసి బుగ్గన చుక్క బెట్టుకున్నాడు. మూలనున్న తంబురా తీసుకుని కళ్యాణి వెనకకుపోయి నిశ్శబ్దంగా కూర్చుని శ్రుతి వేస్తున్నాడు.—

"ఆరి మీ యిల్లంతా బంగారమైపోను. మొగుడూ పెళ్లాం సంగీతాలలో మునిగి తేలుతున్నాం, మేం రాం పొమ్మంటేపోదూ?...పిల్లకు జబ్బుగా వుందని రేడియోలో చెప్పిస్తే పెద్దప్రాణం నేనేంగావాలనీ?...నిత్యకళ్యాణాలా యేమిటి. బుగ్గల్ని ఆ చుక్క బొట్లేమిటి?" అంటూ గది గుమ్మంలో నిల్చున్నాడు కళ్యాణి తండ్రి.